## క్లుప్తంగా

### కనుల పండువగా రథోత్సవం



రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డిలో లక్ష్మీ మాధవస్వామి రథోత్సవం మంగళవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారి ఆలయంలో విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. పూజారుల ప్రత్యేక పూజల అనంతరం, భక్తులు రథాన్ని లాగి జాతర ఉత్సవాలను ప్రారంభించారు. జాతరను పురస్కరించుకుని రథోత్సవం అనంతరం భక్తులు నైవేద్యాలు సమర్పించారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో రాణించాలి



ఉండవెల్లి: మండల కేంద్రంలోని కృష్ణవేణి ఐటీఐ కళాశాలలో బీజేపీ మండల, జిల్లా, మున్సిపాలిటీ నాయకులు మంగళవారం సమావేశమయ్యారు. బీజేపీ నూతన అధ్యక్షులకు జిల్లా అధ్యక్షులు రాంచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ నాయకులు, అధ్యక్షులు ప్రతి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ పడి విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపి నాయకులు నాగేశ్వర్ రెడ్డి, ఈశ్వరయ్య, వెంకటేష్, రంగస్వామి, తదితర్లు పాల్గొన్నారు.

### విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



అలంపూర్ రూరల్: అలంపూర్ మండలంలోని భీమవరం గ్రామంలో పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు రేజింగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఆ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ పిల్లలు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో మధు సూదన రెడ్డి, వెంకటస్వామి, మధు, ఏలిషా, సుధాకర్ నాయుడు, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, రవి, మాధవస్వామి, వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### పేదలకు దుప్పట్ల పంపిణీ



అలంపూర్: అలంపూర్ పట్టణంలోని ఆలయాల సముదాయంలో వివేకానంద యూత్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. దాత కొండేటి హనుమంతరావు సహకారంతో ఆలయ సముదాయం దగ్గర దాదాపు 50 మందికి దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో వివేకానంద యూత్ సొసైటీ అధ్యక్షుడు బుజ్జీ యాదవ్, ఉపాధ్యక్షురాలు కామాక్షి, కమిటీ సభ్యులు సంజీవ నాయుడు, శ్రీనివాసులు, మనోహర్, నాగమద్దిలేటి, రాము, బీసన్న, మధు ఉన్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిని మంగళవారం రాజోళి పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ జగదీష్ వివరాల ప్రకారం.. మాన్‌దొడ్డి శివారులో పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం రావడంతో స్థావరంపై దాడి చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, మరో ఆరుగురు పరారయ్యారయ్యారు. వారిని పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు. రూ.6,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు శివారులో పేకట స్థావరాలపై బుధవారం ఎస్‌ఐ చంద్రకాంత్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పేకాటాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు పారిపోయారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి రూ.5,650 సీజ్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.



కేటీదొడ్డిలో ముగ్గులు వేస్తున్న యువతులు



జోగుళాంబ అమ్మవారికి భక్తుల పూజలు



జింకలపల్లిలో బహుమతులు ప్రదానం..

# పల్లెపల్లెలో సంక్రాంతి సంబరాలు

- అంగరంగ వైభవంగా భోగి, సంక్రాంతి, కనుమలు
- గంగిరెద్దుల ఆటలు, గాలిపటాల ఎగరవేత
- ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులతో గొబ్బెమ్మలు

సాక్షి, నెట్‌వర్క్: మూడు రోజుల సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. భోగి మంటలతో ప్రారంభమైన పండుగ కనుమతో ముగిసింది. మొదటి రోజు భోగి మంటలు, ఇళ్ల ముందు రంగవల్లులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల ఆటపాటలు, పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తూ అలరించారు. రెండో రోజు మకర సంక్రాంతి రోజు రంగవల్లులు, ఆలయాల్లో పూజలు, పిండి వంటలు, ఆటల పోటీలు ప్రారంభించారు. మూడో రోజు కనుమ పండగ ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామీణ సాంప్రదాయం ఉట్టి పడే విధంగా గ్రామీణ క్రీడలు, ముగ్గుల పోటీలు, బంధుమిత్రులతో కలిసి సహపంక్తి భోజనాలతో గ్రామాలు సందడి సందడిగా కనిపించాయి. పాత కొత్త బంధువుల కలయిక, దూర ప్రాంతాల్లో నివాసం ఉంటూ పండగలకు వచ్చిన బంధువులతో పల్లెలు కళకళాడాయి.



అలంపూర్‌లో ముగ్గుల పోటీల్లో మహిళలు



ఉండవెల్లిలో..



అయిజలో..



గుడుదొడ్డిలో ధాన్యం దానం చేస్తున్న మహిళ

# సేవా గుణమే క్రిస్మస్ లక్ష్యం

- ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలటౌన్: తనకు హాని చేసిన వారిని కూడా ప్రేమించమని చెప్పిన యేసుక్రీస్తు బోధనలు పాటించినట్లయితే సమాజంలో శాంతి నెలకొంటుందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఎంబీ మిస్పా చర్చి యవ్వన సమాజం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన 'యవ్వనస్తుల కూడిక' కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాటి మనుషుల పట్ల ప్రేమను, శాంతియుత సహజీవనం, క్షమాగుణం కలిగి ఉండటమే నిజమైన క్రీస్తుతత్వమని అన్నారు. క్రైస్తవుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పాస్టర్ సహో కిరణ్ పాల్ యువతకు సందేశం ఇచ్చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హనుమంతు, ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, చర్చి పాస్టర్ చార్లెస్ శాంతిరాజ్, చైర్మన్ ప్రభుదాస్, సైమన్ సుధాకర్, రవిప్రకాష్, యూత్ కమిటీ చైర్మన్ డేనియల్, సెక్రటరీ ప్రసాద్, ట్రెజరర్ కిరణ్‌దాస్ పాల్గొన్నారు.

## మాదాసి కుర్వ మాదారి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



కేటీదొడ్డి: మాదాసి కుర్వ, మాదారి కుర్వ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు రాఘవ ఆధ్వర్యంలోని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదాసి కుర్వ మాదారి సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని, డిమాండ్ల సాధనకు ఉద్యమించాలని వారు కోరారు. మాదాసి కుర్వ ఎస్సీ సర్టిఫికెట్లు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీరన్న, జయసింహ, జమ్మన్న, నాగేంద్ర, జయరామ్, కొండయ్య, తదితరులు ఉన్నారు.

## స్వామియే శరణమయ్యప్ప



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం సమయంలో పద్దెనిమిది మెట్లకు పడిపూజ నిర్వహించారు. మంగళవారం మకర సంక్రాంతి సందర్భంగా అయ్యప్ప స్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో జ్యోతిని ఎగరవేశారు. కార్యక్రమంలో గురుస్వాములు సూర్యకాంతా రెడ్డి, దామోదర్ రెడ్డి, శివ స్వాములు, అర్చకులు ఆంజనేయ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

మల్దకల్: బరువు, ఎత్తు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సీడీపీఓ హేమలత అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. బుధవారం మల్దకల్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణీలు పోషకాలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు

మానవపాడు: మండలంలోని నాగులకుంట కాలనీలో మంగళవారం రాత్రి నుంచి విద్యుత్ ఓల్టేజీలో హెచ్చు తగ్గుల కారణంగా ఇళ్లలో టీవీలు, ఫ్రీజ్‌లు, ఫ్యాన్లు, తాగునీటి మోటార్లు, చార్జింగ్ పెట్టిన మొబైల్ ఫోన్లు కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే విలువైన వస్తువులు, వేలలో నష్టం వాటిల్లిందని గ్రామస్తులు ఆరోపించారు. పండుగవేళ ఇలా జరగడంతో విద్యుత్ అధికారులపై బాధితుల అగ్రహం వ్యక్తం చేశారు.

## 4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని పోతులపాడు స్టేజీ సమీపంలోని అంతర్రాష్ట్ర రహదారిపై 4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా బ్లూకోర్టు పోలీసులు తనిఖీ చేసి పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం మానవపాడు మండలం కొర్విపాడు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నాగన్న, లక్ష్మన్నలు ఆటోలో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా, పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. ఆటోను ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

# అలరించిన క్రీడోత్సవాలు



మాన్‌దొడ్డిలో జాతరలో కబడ్డీ పోటీలు

- గ్రామగ్రామాన సంక్రాంతి క్రీడల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న యువతీ యువకులు, మహిళలు

సాక్షి, నెట్‌వర్క్: అలంపూర్ మండలంలోని క్యాతూర్‌లో సంక్రాంతి పండగను సందర్భంగా కబడ్డీ పోటీలకు తెలంగాణ రాష్ట్ర స్పో ర్ట్స్ ఆథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కబడ్డీలో మొదటి బహుమతి షేక్ష టీం, రెండో బహుమతి గోపాల్ యాదవ్ వారియర్స్‌లు అందుకున్నాయి. దాతల క్యాతూర్ పీఏసీఎస్ అధ్యక్షులు రాఘవరెడ్డి, శ్రీనివాసులు, పరశురాం, రాజు, చిన్నముని, వేణుగోపాల్ సహకారంతో కబడ్డీ పోటీలు నిర్వహించారు.

■ ఉండవెల్లి మండలంలోని కంచుపాడులో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి యువకులకు సందేశం ఇచ్చారు. మండల కేంద్రంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు.

■ మల్దకల్ మండలంలోని అమరవాయి, ఎల్కూరు, మల్దకల్, బిజ్వారం, మద్దెలబండ, నేతువానిపల్లి గ్రామాలలో క్రికెట్, ముగ్గుల పోటీల విజేతలకు కాంగ్రెస్ నాయకులు పెద్దవీరన్న, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి బహుమతులను ప్రదానం చేశారు.



క్యాతూరులో కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న శివసేనారెడ్డి



మద్దెలబండలో క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

■ రాజోళి మండలంలోని మాన్‌దొడ్డిలో లక్ష్మీ మాధవస్వామి జాతర సందర్భంగా కబడ్డీ పోటీలు ప్రారంభించారు. మొదటి విజేత టీంకు రూ.50 వేల నగదు బహుమతి అందించనున్నారు.

■ శాంతినగర్, వడ్డేపల్లి మున్సిపాలిటీ, ఆయా గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

# సనాతన ధర్మ పరిరక్షణకే పాదయాత్ర



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

ఉండవెల్లి/ఎర్రవల్లి: సనాతన ధర్మం, సంస్కృతిని పరిరక్షించేందుకు వారణాసి నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసినట్లు శివకరణ్ సింగ్ తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫతేపూర్ ఖరౌలి గ్రామానికి చెందిన శివకరణ్ సింగ్ కాశీ నుంచి కన్యాకుమారి వరకు 2022, మార్చి 25న పాదయాత్ర ప్రారంభించారు. పాదయాత్ర ముగించుకొని తిరిగి కాలినడకన జాతీయ హదారిపై స్వగ్రామానికి వెళ్తుండగా మంగళవారం పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద బీజేపీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పోరాడుతున్న అన్నిరంగాల సైనికుల రక్షణకు ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరయ్య, రంగస్వామి, కృష్ణ, మహేందర్, విజయ్, వెంకటేష్‌గౌడ్, ధను తదితరులు పాల్గొన్నారు.

■ హిందూ రాష్ట్ర పరిరక్షణ కోసం ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివకరణ్ సింగ్ కన్యాకుమారి నుంచి కాశీకి (2350కి.మీ) పాదయాత్ర చేపట్టాడు. ఈ సందర్భంగా గత నెలలో కన్యాకుమారి నుంచి ఆయన చేపట్టిన పాదయాత్ర సుమారు 1008 కిలో మీటర్లు ప్రయాణించి మంగళవారం ఎర్రవల్లి మండల కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా నాయకులు నర్సింహులు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించారు. హిందూ ధర్మం కోసం ఆయన చేపట్టిన పాదయాత్ర ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా జరగాలని కోరుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కేకేరెడ్డి, శ్రీనివాసులు, రాజు ఉన్నారు.

## వైభవంగా శివాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

ఎర్రవల్లి: ఇటిక్యాల మండలంలోని వావిలాల శివాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి వేలాది మంది భక్తులతో రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై శివాంజనేయస్వామిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా నిర్వహించిన బ్యాండ్ ప్రదర్శన, కోలాటం పోటీలు అట్టహాసంగా సాగాయి. నాలుగు పళ్ల విభాగంలో ఏర్పాటు చేసిన బండలాగుడు బల ప్రదర్శన పోటీలు హోరాహోరీగా నిర్వహించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన వారికి ఆలయ కమిటీ వారు శాలువాలతో ఘనంగా సత్కరించి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

**ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం**

మండలంలోని కొండపేట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో కుంభాభిషేకం, చండీ హోమం, నగ్రహ హోమాలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సోమనాద్రి శ్రీహరిత దంపతులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



వావిలాలలో రథోత్సవం



కోలాటం వేస్తున్న చిన్నారులు



బండలాగుతున్న వృషభాలు

## పెద్ద చింతరేవులలో వేద పండితుల ప్రత్యేక పూజలు



కృష్ణానదిలో ప్రత్యేక పూజలు చేస్తున్న మల్కాజ్‌గిరికి చెందిన వేద పండితులు

ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయంలో హైదరాబాద్ మల్కాజ్‌గిరికి చెందిన వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు రాఘవేంద్రచార్యులు, ప్రసన్నాచార్యులు, వేణుగోపాలాచార్యులు, ఆద్యాచార్యులు, వెంకోబాచార్యులులతో పాటు మరో 55 మంది సద్ బ్రాహ్మణులు ఉత్తరాయ పర్వ కాలమందు ఆలయం సమిపంలోని కృష్ణానదిలో స్నానమాచరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు బీచుపల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య కేశవాచార్యులు, కిష్టాచార్యులు, మద్వాచార్యులు, వామనాచార్యులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గోపూజ మహోత్సవం



ఎర్రవల్లిలో గోమాతను పూజిస్తున్న భక్తులు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో కనుమ సంక్రాంతిని పురస్కరించుకొని బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానం, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గోపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహస్వామి గోమాతను పూజించడం వల్ల కలిగే ఫలం గురించి వివరించారు. గోమాతను పూజిస్తే సకల దేవతల పూజా ఫలాన్ని వారు పొందుతారని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇమాంపురంలో గోకారమయ్య ఉర్సు



ఇమాంపురం ఉర్సులో మున్సిపల్ వైస్ చైర్మన్, ఏఎస్‌ఐ

అలంపూర్: అలంపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇమాంపురంలో బుధవారం గోకారమయ్య ఉర్సు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వారు కులమతాలకు అతీతంగా తరలి వచ్చి గోకారమయ్యను దర్శించుకోని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఏఎస్‌ఐ ఎస్‌ఎం బాషా భద్రతను పర్యవేక్షించారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఉర్సు ఉత్సవాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఓపెన్‌టు వాలీబాల్ విజేత కర్నూలు

మానవపాడు: చెన్నకేశవస్వామి జాతర సందర్భంగా మండలంలోని బోరవెల్లిలో రెండు రోజులుగా ఓపెన్ టు వాలీబాల్ టోర్నమెంట్‌లో కర్నూలు జట్టు ప్రథమ బహుమతి రూ.30వేలు గెలుచుకుంది. ద్వితీయ బహుమతి బైరాపురం జట్టు రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు గెలుపొందాయి. కబడ్డీ పోటీలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ప్రజల పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మానవపాడు: మండలంలోని జల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007–08 సంవత్సరానికి సంబంధించిన పూర్వ విద్యార్థులు రమ్య, ప్రసన్న, మధుసూదన్, శకుంతల, నజీమా, రమేష్‌నాయుడు, ఆనంద్, అశోక్, గజేందర్‌ల ఆధ్వర్యంలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అంతకుముందు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు.